క్లుప్తంగా

అలరించిన శ్రీకృష్ణ పారిజాతం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో డాక్టర్ శుభ మరువాడ(అమెరికా) బృందం శ్రీకృష్ణ పారిజాతం కూచిపూడి నృత్య రూపక ప్రదర్శనను శనివారం రాత్రి ప్రదర్శించారు. ఏపీ–భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి, డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత, నృత్యపాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించగా, పద్మశ్రీ అవార్డుగ్రహీత అబ్బారెడ్డి నాగేశ్వరరావు, దేవాలయం చైర్మన్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. శ్రీకృష్ణుడిగా ప్రణూషా కారెడ్డి, సత్యభామగా అంబికాశ్రీ సిద్ధాబత్తుల, రుక్మిణిగా ప్రణవి యెర్రమరెడ్డి, నారదునిగా సంధ్య పిరాట్ల నటించారు. నట్టువాంగం డాక్టర్ శుభ మరువాడ, గాత్రం సి.హెచ్. సుధా శ్రీనివాస్, ఎన్.సి.హెచ్.కౌశిక్‌కళ్యాణ్, మృదంగం గణేష్‌రావు, వాయులీనం సీకే విజయ రాఘవన్, వేణువు కుమార్‌బాబు వాయిద్యాన్ని అందించారు. నృత్య రూపక ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. కళాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ కేఎస్ గోవిందరాజన్ సత్కరించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

నగరంపాలెం: స్థానిక చుట్టుగుంటలోని కళా భారతి రెసిడెన్షియల్ ఫర్ ది బ్లైండ్ పాఠశాలలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) ఎండీ.ఇఫ్రత్‌ఫాతిమా అధ్యక్షత వహించారు. పిల్లల ఆరోగ్యంపై వాకబు చేశారు. జీజీహెచ్ నుంచి వచ్చిన వైద్యులు పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని, అలసత్వంగా ఉండవద్దని వివరించారు. వైద్యులు పి.రాజ్‌కుమార్, సుబ్బరాయన్, సి.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

అరండల్‌పేట పీఎస్ సీఐగా వీరాస్వామి

నగరంపాలెం: గుంటూరు పశ్చిమ సబ్ డివిజన్‌లోని అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ సీఐగా వీరాస్వామిని అటాచ్‌మెంట్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఆయన సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. కేసుల్లో ఉన్న బోరుగడ్డ అనిల్‌కుమార్‌కు రాచమర్యాదలు చేపట్టిన క్రమంలో ఈనెల 9న అప్పటి సీఐ కె.శ్రీనివాసరావును వీఆర్‌కు పంపిస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.

పేదల ఇళ్లు తొలగించడం అన్యాయం

లక్ష్మీపురం: తాడికొండ మండలం, లాం గ్రామం పరిధిలో ప్రభుత్వ భూముల్లో అనేక సంవత్సరాల నుంచి నివాసముంటున్న పేదల ఇళ్లను తొలగించడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేక సంవత్సరాల నుంచి నిరుపేదలు ఇళ్లు వేసుకుని నివాసముంటున్నారని తెలిపారు. వారికి ప్రత్యామ్నాయం చూపించకుండా తొలగించడం అన్యాయమని చెప్పారు. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇస్తామని వాగ్దానం చేసి నేడు పేదల ఇళ్లు కూల్చివేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి, ప్రత్యామ్నాయ స్థలాలు చూపి, వారికి ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఇంట్లో బంగారం, నగదు చోరీ

లక్ష్మీపురం: మూడో అంతస్తులో ఎవరు లేకపోవడంతో తలుపులు పగల గొట్టి బీరువాలో ఉన్న బంగారం, వెండి, నగదు చోరీ చేసి ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. కృష్ణానగర్ 2వ లైన్‌కు చెందిన బొడ్డు మల్లేశ్వర వరప్రసాదరావు న్యాయవాది. మూడు అంతస్తుల భవనంలో నివాసం ఉంటారు. మూడో అంతస్తులో తల్లి దండ్రులు, రెండో అంతస్తులో సోదరుడు, కింద భాగంలో వరప్రసాదరావు నివాసం ఉంటారు. ఇటీవల తండ్రి మృతి చెందడంతో తల్లిని కింది భాగంలో వరప్రసాదరావు వద్ద ఉంటుంది. అయితే శుక్రవారం అర్ధరాత్రి మూడో అంతస్తులో శబ్దం రావడంతో రెండో అంతస్తులో ఉన్న సోదరుడికి ఫోన్ చేశాడు. నిద్ర మత్తులో ఉన్న సోదరుడు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. దీంతో వరప్రసాదరావు కూడా పైకి వెళ్లకుండా నిద్రపోయారు. ఉదయం సుమారు 9 గంటల సమయంలో మూడో అంతస్తుకు వెళ్లి చూసే సరికి తలుపులు పగలగొట్టి ఇల్లంతా చిందర వందర చేసి ఉంది. బీరువాలో ఉన్న 40 గ్రాములు బంగారం, ఒక డైమండ్ నెక్లెస్, 400 గ్రాములు వెండి, రూ.30 వేల నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. దీంతో తక్షణమే పట్టాభిపురం పోలీసులకు సమాచారం తెలియజేడయంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన వైనాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించారు. శనివారం బాధితుడు వరప్రసాదరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు విస్తరణ పనులకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్ విస్తరణ పనుల జాప్యం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించుకొని పనులు వేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ మెయిన్ ఆఫీస్‌లోని కమిషనర్ చాంబర్‌లో ఏటీ అగ్రహారం రోడ్ విస్తరణలో కోర్టు కేసులు దాఖలు చేసిన వారితో ప్రత్యేక సమావేశం శనివారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ విస్తరణ పనులపై కొందరు కోర్టుకి వెళ్లారని, సోమవారం నుంచి మూడు రోజుల్లో ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్ మాస్టర్ ప్లాన్‌ని సర్వే చేసి బౌండరీలు ఫిక్స్ చేయాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ సర్వే సమయంలో కోర్టుకి వెళ్లిన వారికి కూడా ముందస్తు సమాచారం ఇవ్వాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్లు, స్ట్రక్చరల్ నష్ట పరిహారం అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ రోడ్డు, డ్రెయిన్, సెంట్రల్ డివైడర్ నిర్మాణ పనులను వేగంగా జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, ఏసీపీ వెంకటేశ్వరరావు, డీఈఈ మధుసూదన్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో ఎటువంటి రాజీ లేదు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపుపై రాజీ లేదని, పట్టణ ప్రణాళిక అధికారులు ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కొరిటెపాడు పార్క్ వెనుక డ్రెయిన్, రోడ్ ఆక్రమణలు సోమవారం నుంచి తొలగించడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ కొరిటెపాడు, విద్యా నగర్ మెయిన్ రోడ్లలో పర్యటించి, ఆక్రమణల తొలగింపుపై అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. కొరిటెపాడు పార్క్ వెనుక రోడ్‌లో సుమారు 60 శాతం, డ్రెయిన్‌ని పూర్తిగా ఆక్రమణ చేసి వ్యాపారాలు నిర్వహించడంపై పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కొరిటెపాడు మెయిన్ అవుట్ ఫాల్ డ్రెన్ కూడా ఆక్రమణకు గురి కావడం వలన పూడిక తీయడానికి వీలు లేక వర్షాలు వస్తే నీరు చుట్టుపక్కల నివాసాల్లోకి వస్తుందన్నారు. ఆదివారం సాయంత్రానికి డ్రెయిన్, రోడ్ మీద ఆక్రమణలను వారే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే సోమవారం ఉదయం నుంచి నగర పాలక సంస్థ దళం పూర్తిగా తొలగిస్తుందని చెప్పారు. ఆక్రమణలు తొలగించిన ప్రాంతాలోని డ్రెయిన్లలో పూడికను వెంటనే తొలగించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వీధి వ్యాపారులు డ్రెయిన్‌కి వెలుపలకు రాకూడదన్నారు. అనంతరం డాన్ బాస్కో ఎదురు డ్రైన్ పై స్లాబ్ ని పరిశీలించి, డ్రెయిన్‌లో పూడిక తీయడానికి వీలుగా ప్రతి ఐదు అడుగులకు ఒక మ్యాన్ హోల్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్లు వి.శ్రీరామ్ ప్రసాద్, కె.కోటేశ్వరరావు, ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు పాల్గొన్నారు.

చదువుతో పాటు సేవాభావాన్ని కలిగి ఉండాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చదువుతో పాటు సామాజిక సేవాభావాన్ని కలిగి ఉండాలని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. అనితాదేవి మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే వస్తువులను వినియోగించకుండా సమాజాని చైతన్యపర్చాలని సూచించారు. ఈసందర్భంగా వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరుజిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణాధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి ఆర్. జయశైలజ, వ్యాయామ అధ్యాపకుడు ఆర్. శివాజీ, వైస్ ప్రిన్సిపాల్ భాను మురళి పాల్గొన్నారు.

సంస్కారంతో కూడిన విద్యనందించాలి



వేదికపై డీఈఓ రేణుక, రాయపాటి మమత, ఫ్రాన్సిస్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: సంస్కారంతో కూడిన విద్యనందించడం ద్వారానే విద్యార్థులను సన్మార్గంలో నడిపించగలమని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం ఆక్స్‌ఫర్డ్ స్కూల్ కిడ్డీస్ ఫెస్టివల్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈఓ రేణుక మాట్లాడుతూ చిన్న పిల్లల్లో ఊహాశక్తి, గ్రహణశక్తి ఎక్కుగా ఉంటుందని, మనం ఎంత నేర్పిస్తే దానికి రెండింతలు ఈ వయసులోనే నేర్చుకుంటారని అన్నారు. రమేష్ హాస్పిటల్స్ డీజీఎం డాక్టర్ మమత రాయపాటి మాట్లాడుతూ చిన్నారుల్లో భగవంతుడు కొలువై ఉంటారని, తల్లిదండ్రులు, గురువులు వారికి మానవత్వంతో కూడిన కథలు చెప్పి వారిలో దానవత్వాన్ని దూరం చేసి, మానవత్వపు విలువలు పెంపొందించాలని సూచించారు. సినీ నటుడు నాగులపల్లి మానస్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూరితంగా ఉండాలని, ఒత్తిడిని దూరం చేసే విధంగా ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎస్.ఫ్రాన్సిస్‌రెడ్డి, డైరెక్టర్లు విజయభాస్కర్‌రెడ్డి, జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, స్మార్ట్ కిడ్స్ క్యాంపస్ ఇన్‌చార్జ్ పి. సరోజిని, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మరుగునపడి..



అది జిల్లా కలెక్టరేట్.. అనేక ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. వేల సంఖ్యలో ఉద్యోగులు పనిచేస్తున్నారు. నిత్యం వేల సంఖ్యలో ప్రజలు వచ్చిపోతుంటారు. కానీ కనీస వసతులకు నోచుకోవడం లేదు. జిల్లా ఖజానా కార్యాలయం ఎదురు ఉన్న ఖాళీ స్థలంలో సులభ్ కాంప్లెక్స్(మరుగుదొడ్లు) పురుషులు, మహిళల కోసం ఏర్పాటు చేశారు. వాటిని పట్టించుకోవడం లేదు. మరుగుదొడ్ల వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. బూజు పట్టి, అడుగు పెట్టలేని దుస్థితిలో ఉన్నాయి. దీంతో జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో పలు రకాల పనుల కోసం వచ్చే వారు మురుగు దొడ్లు లేక అవస్థలు పడాల్సి వస్తుంది.

\- లక్ష్మీపురం



జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో సులభ కాంప్లెక్స్ (మరుగు దొడ్లు)

హాయిగా నవ్వుదాం.. నవ్విద్దాం



లక్ష్మీపురం: శారీరకంగా, మానసికంగా ఎంతో ఆరోగ్యాన్నిచ్చి ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండేలా చేసే నవ్వు ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, మనసారా నవ్వుకుంటూ, తమ చుట్టూ ఉన్న వారిని కూడా నవ్విస్తూ ఉండాలని ప్రముఖ లాఫింగ్ థెరపిస్ట్ డాక్టర్ ఇమ్రాన్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన హాస్యవలరి శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవ్వు అనేక రోగాల నివారణకు అత్యుత్తమమైన మందు అని, శరీరానికి స్వస్థత చేకూర్చగల హార్మోన్లను విడుదల చేస్తుందన్నారు. గుండెకు, ఊపిరితిత్తులకు నవ్వు మంచి వ్యాయామని రోగులు వేగంగా కోలుకోవడంలో నవ్వు కీలక పాత్ర వహిస్తుందన్నారు. హాస్యం ఒక ఆప్త మిత్రుని వంటిదన్నారు. అది మనల్ని నవ్విస్తుంది.. కవ్విస్తుంది.. ఆనందపరవశుల్ని చేస్తుందన్నారు. రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆనందానికి సూచిక, ఆహ్లాదానికి సంకేతం నవ్వు అని గతంలో నవ్వు నాలుగు విధాల చేటు అనే వారిని ఇప్పుడు నవ్వు నాలుగు విధాల గ్రేట్ అంటున్నారన్నారు.

108 అంబులెన్స్‌లను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి



లక్ష్మీపురం: 108 సేవలను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం 108 అంబులెన్స్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై.శివశంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ 25వ తేదీ సమ్మె నిర్వహించనున్నట్లు చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీలను 108 ఉద్యోగులతో భర్తీ చేయాలన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన జీఓ నంబర్ 49 ప్రకారం 4,000 రూపాయలు తిరిగి పునరుద్ధరించాలని, ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులను వారి వసొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. 108 సేవలలో ప్రస్తుతం ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 108 ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు రామకృష్ణ, ఎంఎల్ పార్టీ నాయకులు ఉల్లి గడ్డ నాగేశ్వరరావు, బీఎస్పీ నాయకులు వాసు మాట్లాడుతూ ఈరోజు గోల్డెన్ అవర్‌లో హాస్పిటల్ చేర్చి ప్రాణాలు రక్షించడం 108 కీలకంగా ఉందని తెలిపారు. కాని జీవితాల్లో వెలుగులు లేవని చెప్పారు. ప్రజలకు అసౌకర్యం కల్పించే విధంగా మేము సమ్మెలోకి రావడం లేదని ప్రభుత్వమే మా సమస్యలు పరిష్కరించని కారణంగా సమ్మెలోకి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. 108 ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం పెట్టినటువంటి తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

నేడు చలో బెజవాడ- బచావో వక్ఫ్

పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీలక్ష్మణరావు, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిష్తీ

లక్ష్మీపురం: 'చలో బెజవాడ– బచావో వక్ఫ్' అంటూ లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు కోరారు. బ్రాడీపేటలో కార్యక్రమ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చట్ట సవరణలు రాజ్యాంగ విరుద్ధమని వీటి వ్యతిరేకంగా ఇండియా వేదిక పలు పార్టీలు వ్యతిరేకించినప్పటికీ నామ మాత్రంగా అభిప్రాయాలు సేకరించిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ రిపోర్టు ఆధారంగా రేపు వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎన్డీఏ ఈ బిల్లును ప్రవేశపెట్టబోతుందని చెప్పారు. ఇది మైనారిటీల హక్కులను కాలరాయడమే అని దీనికి వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిష్తీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్ట సవరణలు వలన మైనారిటీలపై ఆర్థిక దాడి జరుగుతుందని హెచ్చరించారు. సవరణలు వక్ఫ్ స్వయం ప్రతిపత్తిని హరించే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముస్లిం మైనారిటీలు లౌకికవాదులు ప్రజాతంత్ర వాదులు అందరూ పాల్గొని ఈ సదస్సుని జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక నాయకులు ఎండీ కలాం, జిల్లా ఆవాజ్ అధ్యక్షుడు ఎస్కే బాషా, నాయకులు ఖాసిం వలి, ఎస్కే సైదా మైనారిటీ నాయకులు సూఫీ ఇమ్రాన్, ఎస్కే సమీర్ పాల్గొన్నారు.

6 నుంచి ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర బాబు



రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

లక్ష్మీపురం: ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజేంద్ర బాబు తెలిపారు. కొత్తపేటలోని సీపీఐ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువత పాత్ర అత్యంత కీలకమైనదన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం యువజన హక్కుల సాధన కోసం ఏఐవైఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తోందని చెప్పారు. యువత కదిలి రావాలని కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాని మాట్లాడుతూ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలని, అదే విధంగా హామీ ఇచ్చిన విధంగా వలంటీర్లకు 10 వేల రూపాయల జీతంతో పాటు వాళ్లను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నాసర్జీ, నగర కార్యదర్శి మరియదాసు, యస్వంత్, రెహ్మాన్ పాల్గొన్నారు.

బాలోత్సవ్‌లో సీతారామయ్య స్కూల్ విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న శివాజీ, విష్ణువర్ధన్, కృష్ణవేణి

గుంటూరు ఎడ్యుకేషన్: పెదకాకాని మండలం నంబూరులోని వీవీఐటీలో ఇటీవల నిర్వహించిన బాలోత్సవ్‌లో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ తెలిపారు. శనివారం లక్ష్మీపురంలోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ వాద్య సంగీత విభాగంలో జైనీల్ ద్వితీయ బహుమతి, కథా రచనలో సహస్య లియోర తృతీయ బహుమతి, సంస్కృత శ్లోకాల పోటీలో అభినవవర్చస్వి, అద్వైత భారతి తృతీయ బహుమతి, పదుల సంఖ్యలో విద్యార్థులు పలు విభాగాల్లో కన్సోలేషన్ బహుమతులను కైవసం చేసుకున్నారని వివరించారు. తమ పాఠశాలలో చదువుతోపాటు అన్ని రకాల కళలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నామని, తద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతతో కూడిన సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాద రావు, అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్స్ దుర్గాశ్యామ్, తిరువీధుల శ్రీదేవి పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో కేఎల్పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణప్రసాద్, రత్తయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వహించిన దక్షిణ భారత దేశ స్థాయి క్విజ్ పోటీల్లో డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి.రత్తయ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్తయ్య మాట్లాడుతూ 50 టీంలు పాల్గొన్న క్విజ్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన తమ పాఠశాల విద్యార్థులు రూ.10 వేలు నగదు బహుమతిని నెక్స్‌జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ కె.శ్రీకాంత్ బాబు, క్విజ్ మాస్టర్ ఎస్.రంగరాజన్ చేతుల మీదుగా అందుకున్నారని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించేందుకు విద్యార్థులకు చిన్నతనం నుంచే జనరల్ నాలెడ్జ్ ఎంతో అవసరమనే ఉద్దేశంతో పాఠశాలలో ఒక పీరియడ్ వివిధ రంగాలపై క్విజ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతం పెంచాలి



ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: సమాజంలో మాల, మాదిగలు నేటికీ అంటరానితనం, లైంగికదాడులకు గురవుతున్నారని, ఆధిపత్య కులాలతో సమానంగా వారు ఎదగలేదని, పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని సామాజిక వేత్త డాక్టర్ గోళ్లమూడి రాజ సుందరబాబు డిమాండ్ చేశారు. శనివారం అంబేడ్కర్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ర్యాలీ పోస్టర్ ఆవిష్కరించారు. విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చి ఏడు దశాబ్దాలు అయినా అణగారిన వర్గాలు అభివృద్ధికి, సమానత్వానికి నోచుకోలేని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ 26న రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవం జరిపే కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటలకు వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్‌కు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, ఆర్.చినరాజు, రాయపూడి మరియదాసు, కూరపాటి అజయ్, పిల్లి సాగర్, డేవిడ్ విలియమ్స్ పాల్గొన్నారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

ఎస్పీ సతీష్‌కుమార్



అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ

పట్నంబజారు: ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. శనివారం నగరంలోని గుజ్జనగుండ్ల, కొరిటెపాడు, లక్ష్మీపురం ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులతో కలిసి వాహనాల రద్దీ, రాకపోకలను పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ వాహనాల రద్దీ క్రమబద్ధీకరణ, అతివేగ నియంత్రణ, ర్యాష్ డ్రైవింగ్, స్నేక్ డ్రైవింగ్‌లను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఇటీవల యువత వాహనాలను గాలిలో నడుపుతూ, ఇతర వాహనదారులను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు, ప్రమాదాలకు కారణమవుతున్నారని, అటువంటి వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆకతాయిలను గుర్తించేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపడం, ఇష్టానుసారంగా డ్రైవింగ్ చేయడం వంటివి చేస్తే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకునేందుకు నగరంలోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రదేశాలు, ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు, విధుల్లో ఉండే ట్రాఫిక్ సిబ్బంది బాడీ కెమెరాలను సక్రమంగా వినియోగించాలని సూచించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏవిధంగా వాహనాలు నడుపుతున్నారో పరిశీలించుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యులవుతారని హెచ్చరించారు. ఎస్పీతో పాటు ఎస్‌బీ డీఎస్పీ సీతారామయ్య, వెస్ట్ డీఎస్పీ మెహర్ జయరామ్‌ప్రసాద్, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్, ట్రాఫిక్ సీఐలు సింగయ్య, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ



గుంటూరు మెడికల్: కేవలం వైద్య సేవలకే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువ కావాలని ప్రముఖ న్యూరాలజిస్ట్, లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. ఇటీవల గుంటూరు జిల్లాలో వచ్చిన వరద బీభత్సం కారణంగా పలు ప్రాంతాలు ముంపునకు గురై, జీవనోపాధి కోల్పోయి ఇబ్బందులు పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెదలంక గ్రామానికి చెందిన సుమారు 25 కుటుంబాలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని డాక్టర్ విజయ దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం ఆమె వారికి సరుకులు అందజేశారు. బియ్యం, కందిపప్పు, వంట నూనె, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ జనరల్ మేనేజర్ సురేష్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు వెస్ట్)
9912220356
Office mail : sakshigntadvt@gmail.com